
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 16 మే 2025





‘ఉపాధి’పై నిరంతర నిఘా..

- విజిలెన్స్ మానిటరింగ్ కమిటీల ఏర్పాటు
- జిల్లాలో 260 కమిటీల ఏర్పాటుకు కసరత్తు
- అవినీతి, అక్రమాలకు బ్రేక్ వేసే దిశగా చర్యలు
- పనుల్లో పారదర్శకతకు పెద్దపీట
- జిల్లాలో 98122 జాబ్ కార్డులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల్లో అవినీతి, అక్రమాలకు బ్రేక్ పడేలా, మొక్కుబడి సామాజిక తనిఖీలకు స్వస్తి పలికే దిశగా నిరంతరం ఉపాధిపై నిఘా పెట్టే విధంగా చర్యలు మొదలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఉపాధిహామీ పనులను పర్యవేక్షించేందుకు గ్రామ పంచాయతీల వారీగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే గ్రామ పంచాయతీల కార్యదర్శులకు సర్క్యులర్‌లు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామపంచాయతీల్లో ఐదుగురు సభ్యులతో కూడిన వీఎంసీ కమిటీల ఏర్పాటు మొదలుపెట్టారు. నిఘా పర్యవేక్షణగా ఉండే కమిటీల్లో మండల ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళ సంఘం, స్వచ్ఛంద సంస్థ, ఉపాధి కూలీల నుంచి ఒక్కొక్కరు సభ్యులుగా ఉంటారు. ఇందులో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సభ్యులు రిసోర్స్‌పర్సన్‌లు, స్వచ్ఛంద క్లబ్‌లలోని సభ్యులు కమిటీల్లో ఉంటారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ కమిటీలు ఆరు నెలల పాటు పనిచేయనున్నాయి.

జిల్లాలో 1.99 లక్షల మంది ఉపాధి కూలీలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 98,122 జాబ్ కార్డులు ఉండగా, 1,99,674 మంది కూలీలు ఉన్నారు. ఇందులో ఎస్సీ 52,701, ఎస్టీలు 13,385 మంది, ఇతరులు 1,31,588 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 1,01,264 మంది ఉన్నారు. జిల్లాలో ఉపాధిహామీ పనుల్లో మహిళలే ఎక్కువగా పనిచేస్తున్నారు. ఉపాధిహామీ పనిదినాలను ప్రభుత్వం ఇటీవల తగ్గించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు 7రూపాయల కూలి పెంచుతూ ప్రస్తుతం ఉన్న రూ.300ను రూ.307కు పెంచింది. ఉపాధిహామీ పనులను మరింత పారదర్శకంగా కొనసాగే విధంగా, క్షేత్రస్థాయిలో పరిశీలించి కూలీల హాజరులో జవాబుదారీతనం పెరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు నామమాత్రంగా పనులు జరగకుండా పర్యవేక్షణ కమిటీల ద్వారా నిఘా కొనసాగుతుంది.

ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ..

ఉపాధిహామీ పనుల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు చోటు చేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ కమిటీలు చూసుకుంటాయి. ప్రతినెలా ఒకరోజు పంచాయతీ కార్యదర్శితో కలిసి ఉపాధిహామీ కూలీ లు, సిబ్బందితో సమావేశం అవుతారు. పనుల నిర్వహణ, ఉపాధి రికార్డులు, పనుల్లో నాణ్యత, సౌకర్యాలు, ఖర్చులు, అంచనా వేసిన పనులపై నివేదికను రూపొందిస్తారు. సోషల్ ఆడిట్ సమయంలో కూడా నివేదికలను పరిగణనలోకి తీసుకుంటారు. ఉపాధిహామీ పనుల పై ప్రతీయేటా నిర్వహించే సామాజిక తనిఖీల్లో అక్రమాలు వెలు గులోకి వస్తున్నా చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలోనే మొక్కుబడి గా సాగే సామాజిక తనిఖీలకు స్వస్తి పలికే విధంగా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలు పనిచేయనున్నాయి.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు..

- ఆన్‌లైన్‌లో కూలీల ఫొటోకు బదులు మొక్కల ఫొటోలు
- కలెక్టర్‌కు సోషల్ మీడియాలో ఫిర్యాదు
- అధికారుల విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

8

ఘనంగా ‘సందల్’ ప్రదర్శన

- వేడుకలకు హాజరైన కేటీఆర్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాహుస్సేన్..
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



దప్పుచప్పుళ్ల మధ్య సందల్ ఊరేగింపు

8

బీరప్ప కల్యాణోత్సవంలో కేటీఆర్..



బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్న కేటీఆర్

తంగళ్లపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామంలో నిర్వహించిన బీరప్ప కల్యాణోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కుర్మ సంఘం నాయకుడు మల్లేశం ఆధ్వర్యంలో కేటీఆర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ నాయకులు గూడూరి ప్రవీణ్, బొల్లి రామ్మోహన్, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు సింగిరెడ్డి రవీందర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కొత్త సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వేములవాడ, మే 15 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సార్వత్రిక కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ కోరారు. వేములవాడలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు ఈపీఎఫ్‌వో ద్వారా కనీస పెన్షన్ 6000 ఇవ్వాలని, అన్ని జిల్లా కేంద్రాల్లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని ఆయన అన్నారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కొందరికి మాత్రమే ఈఎస్ఐని అమలుచేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసిందన్నారు. కార్పొరేట్ రంగాలకే వత్తాసు పలుకుతూ కార్మికులను, వారి హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏటియుసి నాయకులు కడారి రాములు, వేణు, బిక్షపతి, శాంత, కె.వి అనసూర్య, మహేష్, బాలా గౌడ్, పార్వతి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి బియ్యం వితరణ

తంగళ్లపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఎల్లవ్వ కుటుంబానికి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి సత్తు శ్రీనివాస్‌రెడ్డి బియ్యాన్ని వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ఫిషరీష్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు హారిక రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆశాను మహిపాల్‌రెడ్డి, యాస రాజేష్, అమరగుండ బాలయ్య, తంగళ్ళపల్లి రవి, పెద్ది పరశురాంగౌడ్, బుర్ర బబ్లు, చెక్కపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సభాస్థలిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

రుద్రంగి, మే, 15(ఆంధ్రజ్యోతి) : రుద్రంగిలో శుక్రవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశించారు. రుద్రంగి మండల కేంద్రంలో మంత్రుల పర్యటన నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితేలతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ చట్టం, భూ భారతి చట్టం పైలట్ ప్రాజెక్టు కింద ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రుద్రంగి మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం కూడా హౌసింగ్ శాఖ మంత్రి చేతుల మీదుగా జరుగుతుందని తెలిపారు. అలాగే రుద్రంగిలోని బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు పాల్గొనన్నుట్లు తెలిపారు. రుద్రంగిలో ఇంటి కోసం పేదలు చేసుకున్న దరఖాస్తులు ఇంకా ఏమైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే మంజూరు చేయాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. మంత్రి పర్యటనకు రైతులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రుద్రంగిలో పర్యటించనున్నారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహణకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేయాలని, సంబంధిత ప్రజా ప్రతినిధులను ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు సూచించారు. రెవెన్యూ సదస్సుల వద్ద పారిశుధ్య నిర్వహణ, లైటింగ్ మొదలగు ఏర్పాట్లను ఎంపీడీవో పకడ్బందీగా పూర్తిచేయాలన్నారు. హెలిపాడ్ వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని, టెంట్, కుర్చీలు, సభావేదిక వంటి ఏర్పాట్లను ఆర్‌అండ్‌బీ అధికారి పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అంబులెన్స్ అందుబాటులో పెట్టాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సమావేశం వద్ద ఫైర్ ఇంజన్ అందుబాటులో పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి ప్రారంభించే కార్యక్రమ ఇంటి స్థలాలు, హెలిప్యాడ్, బహిరంగ సభా వేదిక, రెవెన్యూ సదస్సులు జరిగే సభా వేదిక, గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూభారతి సహాయ కేంద్రం వంటివి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, రుద్రంగి తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, సూర యాదయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

‘రాజీవ్ యువ వికాసం’లో అర్హులను ఎంపిక చేయాలి

- 20లోగా లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవోలు అందించాలి - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పారదర్శ కంగా రాజీవ్ యువవికాసంలో నిరుపేద యువ లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికపై ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజీవ్ యువ వికాసం కింద 36,819 దరఖాస్తులు వచ్చాయని, వీటిని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి 30,627 దరఖాస్తులను బ్యాంకులకు పంపించామన్నారు. 6,192 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించామన్నారు. బ్యాంకులు 30,627 దరఖాస్తుదారుల బ్యాక్‌గ్రౌండ్, స్క్రూటినీ పూర్తిచేశాయని తెలిపారు. గంభీరావుపేట మండలంలో దళారులు యువ వికాసం పథకం కింద యూనిట్ ఇప్పిస్తామని ప్రజల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారం అందుతుందని, పారదర్శకంగా యువ వికాసం యూనిట్ల ఎంపిక జరుగుతుందని, ఎవరు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరిగిందని, అదేవిధంగా ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ నిరుపేదలకు ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తూ పారదర్శకంగా వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దళారుల ఒత్తిడి లేకుండా పేదలకు మాత్రమే పథకం అందాలని, ఎక్కడైనా అనర్హులకు చేరితే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలను మోసగిస్తున్న దళారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, ఎల్‌డీఎం మల్లికార్జున్‌రావు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎంప భారతి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజమనోహర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి ‘పొంగులేటి’..

సిరిసిల్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి హెలికాప్టర్ ద్వారా జిల్లాలోని రుద్రంగికి చేరుకుంటారు. 4.10 గంటల నుంచి 5.30 గంటల వరకు భూభారతి చట్టంలో భాగంగా రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద హెల్ప్‌డెస్క్, దరఖాస్తులను పరిశీలిస్తారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేసి బహిరంగ సభలో మాట్లాడుతారు.

మంత్రుల పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత

- ఎస్పీ మహేష్ బి గితే - ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్ల క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ మహేష్ బి.గీతే అన్నారు. రుద్రంగిలో శుక్రవారం మంత్రుల పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రుద్రంగి మండలంలో మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. సభా ప్రాంగణంలో, వీఐపీ, జనరల్ గ్యాలరీ, రూట్ బందోబస్తు, వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్ ప్రదేశాల్లో బందోబస్తులో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, డీసీఆర్బీ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, మధుకర్, నాగేశ్వరరావు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు రమేష్, మధుకర్‌లు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం

ఎల్లారెడ్డిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంక్షేమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కృషిచేస్తున్నామని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబేరాబేగం మాట్లాడుతూ రైతులు పండించిన వరిధాన్యం సేకరణను వేగవంతం చేసి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్వాహకులు, సంబంధిత శాఖ అధికారులకు సూచిస్తున్నామన్నారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి రైతులు సాగు చేసుకునేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామన్నారు. వైస్‌చైర్మన్ రాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు రవీందర్, రాజేందర్, కృష్ణారెడ్డి, తిరు పతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, గణపతి, బాలయ్య, లక్ష్మీ శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కేటీఆర్



పెద్దూర్‌లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముష్కం దేవయ్యగౌడ్(లడ్డు), శారద దంపతుల కుమార్తె రూపశ్రీ, అరవింద్‌గౌడ్‌లకు బుధవారం వివాహం కాగా, గురువారం సాయంత్రం నూతన వధూవరులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ వారి నివాసానికి వెళ్లి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎరవెల్లి వెంకటరమణరావు, గండ్ర రమేష్‌రావు, జూపల్లి శ్రీనాథ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, సలేంద్రీ బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంభీరావుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లారెడ్డిపేటకు చెందిన శేఖర్ (35) అర్ధరాత్రి దాటాక మృతిచెందాడు. మల్లారెడ్డిపేటకు చెందిన ఖలీల్, శేఖర్‌లు ద్విచక్ర వాహనంపై లింగన్నపేట వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలకు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని 108 వాహనంలో ఆసుపత్రికి తీసుకెళుతుండగా, మార్గమధ్యలో ఖలీల్ మృతిచెందగా, శేఖర్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. దీంతో చికిత్స పొందుతూ శేఖర్ కూడా మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్ఐ ప్రేమానందం తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన చట్టు కనకరాజు(50) బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కనకరాజు జీవనోపాధి కోసం కొంత కాలం కిందట విదేశాలకు వెళ్లి ఆరునెలల కిందటే గ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. భార్యాపిల్లలతో నిత్యం గొడవపడేవాడు. బుధవారం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చి కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. మళ్లీ ఇంటి నుంచి బయటకు వెళ్లి మద్యం తాగి వచ్చాడు. రాత్రి 8గంటలకు గదిలోకి వెళ్లిన కనకరాజు మద్యంమత్తులో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కనకరాజు భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మలేషియాలో హబ్సీపూర్ వాసి మృతి

జగిత్యాలరూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన కారం నర్సయ్య అనే గల్ఫ్ కార్మికుడు మలేషియాలో మృతిచెందినట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీకమిటీ ప్రతినిధి మంద భీంరెడ్డి తెలిపారు. నర్సయ్య 23 ఏళ్లుగా మలేషియాలో ఉంటున్నాడు. ఐదునెలలుగా ఎలాంటి సమాచారం లేకపోవడంతో కుటుంబీకులు మాజీమంత్రి జీవన్‌రెడ్డిని కలిశారు. స్పందించిన మాజీమంత్రి ఆయన ఆచూకీ కనిపెట్టాలని ఎన్ఆర్ఐ అడ్వైజరీని కోరాడు. మలేషియాలోని మార్చురీలో నర్సయ్య మృతదేహం ఉన్నట్లు ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వారు గుర్తించారు. ఎప్పుడు, ఎలా మృతిచెందాడనే వివరాలు తెలియాల్సి ఉంది.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



రాజీవ్‌గాంధీ(ఫైల్)

ఎలిగేడు, మే 15 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతోకలిసి ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామంలో బుధవారం వేంకటేశ్వరస్వామి రథోత్సవం జరిగింది. గోదావరిఖనిపట్టణం జైభీమ్ నగర్‌కు చెందిన ముస్కె రాజీవ్‌గాంధీ(35) స్నేహితులతోకలిసి ముప్పిరితోటలో రథోత్సవంలో పాల్గొన్నాడు. అనంతరం సరదాగా ఈత కొట్టేందుకు సాయంత్రం వ్యవసాయ బావిలోకి దిగాడు. రాజీవ్‌గాంధీకి ఈత రాకపోవడంతో బావిలో గల్లంతయ్యాడు. స్నేహితులు స్థానికులకు సమాచారం అందించడంతో బావిలో ఆచూకీకోసం వెతికారు. గురువారం పోలీసులు, పెద్దపల్లి, గోదావరిఖనికి చెందిన రెస్క్యూటీంతో బావిలో వెతుకగా మృతదేహాన్ని లభ్యమైంది. మృతుడు సింగరేణిలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడికి తల్లితోపాటు అక్క,చెల్లి ఉన్నారు. గతంలో తండ్రి చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

వేములవాడ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): నీటిసంపులో పడి చిన్నారి మృత్యువాత పాడిన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెందిన జిక్రా ఫాతిమా(4) అనే పాప ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు ఏరియా ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యలోనే పాప మృతిచెందినట్లు వైద్యాధికారులు వెల్లడించారని తెలిసింది. ఈ సంఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు



మృతిచెందిన ప్రశాంత్ బెహోరీ

రామడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలోని చిప్పకుర్తి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకయువకుడు దుర్మరణం చెందగా, మరోఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. సుశాంత్ బెహోరీ బైక్‌పై.. మరో ఇద్దరు ప్రశాంత్ బెహోరీ(21), తోకల్ శరత్‌చంద్రతో కలిసి కరీంనగర్ నుంచి గోపాల్‌రావు పేటకు వెళ్తున్నారు. అతివేగంగా అజాగ్రత్తగా బైక్ నడిపిన సుశాంత్ బెహోరీ చిప్పకుర్తివద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనున్న సిమెంట్ బెంచ్‌ని ఢీకొట్టాడు. దీంతో ప్రశాంత్‌బెహోరీ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలు కాగా వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. శరత్‌చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ సతీష్ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యంసేవించి వాహనం నడిపినవ్యక్తికి జగిత్యాలసెకండ్‌క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కరుణాకర్ ఒకరోజు జైలుశిక్ష విధించారు. రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామానికి చెందిన అల్లెపు వెంకటనర్సయ్య(49) అతిగా మద్యం సేవించి వాహనం నడుపగా రాయికల్ ఎస్సై సుధీర్ పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారించిన జడ్జి నర్సయ్యకు ఒక రోజు జైలు శిక్ష విధించారు.

డెంగ్యూతో జాగ్రత్త



- నివారణ చర్యలపై ప్రభుత్వ ప్రచారం
- నేడు జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం

జగిత్యాల/సుభాష్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): 'దోమలు పుట్టకుండా చూసుకుందాం... దోమలు కుట్టకుండా చూద్దాం... డెంగ్యూ వ్యాధిని తరిమికొడుదాం' ఇవీ డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రభుత్వ ప్రచార స్లోగన్స్. ప్రమాదకరమైన డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ ఇటీవల ప్రభుత్వం వాల్‌పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టింది. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ముఖ్యంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రచారం నిర్వహించడంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో డెంగ్యూ వ్యాధి నియంత్రణ, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

దోమకాటుతోనే..

డెంగ్యూకి కారణమయ్యే ఫ్లేవీ వైరస్‌లు ఆడ ఏజిస్ ఈజిప్టై దోమ కుట్టడం ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. ఈ వైరస్‌లలో నాలుగు రకాలున్నాయి. ఒక రకం వైరస్‌తో ఒకసారే డెంగ్యూ వస్తుంది. ఇతర రకాల వైరస్‌లతో మరోసారి రావొచ్చు. అంటే ఒకరికి జీవితంలో గరిష్ఠంగా నాలుగు సార్లు డెంగ్యూ వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రెండో సారి, మూడోసారి మరో రకం వైరస్‌తో జ్వరం వస్తే మాత్రం చాలా తీవ్రంగా ఉంటుంది.



లక్షణాలు ఏమిటి?

దోమ కుట్టిన తర్వాత 3 నుంచి 14 రోజుల్లోపు ఎప్పుడైనా డెంగ్యూ ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలుంటాయని వైద్యులు చెబుతున్నారు. తొలి, విషమ దశలను బట్టి లక్షణాలు కనిపిస్తాయి. తొలిదశలో హఠాత్తుగా తీవ్ర జ్వరం, భరించలేని తలనొప్పి, కళ్ల వెనకాల నుంచి నొప్పి, కళ్లు ఎర్రగా మారడం, ఉబ్బడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వాంతి, వికారం, ఆకలి మందగింపు, చర్మం మీద ఎర్రటి దద్దుర్లు, దురద వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా ఛాతీ మీద మొదలై చేతులు, కాళ్లు, ముఖానికి వ్యాపిస్తుంది. విషమ దశలో పొట్ట ఉబ్బడం, పొట్టలో నొప్పి, ఆయాసం, బీపీ పడిపోవడం, కాళ్లు చేతులు చల్లబడడం, చికాకు, మగత, చిగుళ్ల వంటి భాగాల నుంచి రక్తం కారడం, చర్మం మీద ఎర్రటి చుక్కల్లాంటి మచ్చలు ఏర్పడడం వంటివి కనిపిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే మేలు


ఇంటితోపాటు ఆవరణలో నీటి కుండీలు, డ్రమ్ములు, గోళాలు వంటి ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి. కనీసం వారానికి ఒకసారి నీరు నిలువ చేసే పాత్రలను ఖాళీ చేయాలి. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో నీటి గుంటలు లేకుండా చూడాలి. ఇంటిపై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులపైన దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి. సెప్టిక్ ట్యాంకు గొట్టం, గ్యాస్ పైప్‌లైన్ పైన పలుచని బట్ట చుట్టాలి. దీంతో దోమల నివారణ చేపట్టవచ్చు. మురికి కాలువల్లో చెత్తచెదారం తొలగించి మురుగు నీరు పారే విధంగా చూడాలి. కాలువల్లో చెత్తా చెదారం, చెట్లకొమ్మలు వేయరాదు. పనికి రాని సీసాలు, డబ్బాలు, రబ్బరు టైర్లు, వాటర్ కూలర్స్ తదితర పాత్రలపైనా నీరు నిలువ లేకుండా చూడాలి. వాటిలో నీరు నిలిచిన వారం రోజుల్లో దోమలు పెరిగే అవకాశం ఉంది. దోమ తెరలు, ఇంటి కిటికీలకు జాలీలు వాడడం, వస్త్రధారణ, దినచర్యల్లో మార్పులు, దోమలను చంపే క్రీములు, స్ప్రేలు వాడాలి. రసాయనాలతో పొగబెట్టడం, ఇళ్లలో మందులు చల్లడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రచారం చేస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి..

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, జగిత్యాల



అప్రమత్తతోనే డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చు. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకొని డెంగ్యూ వ్యాప్తి చెందకుండా ప్రయత్నాలు చేయాలి.



ప్లేట్ లెట్స్ లెక్కింపు

డెంగ్యూ జ్వరంలో అందరికీ ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం ఉండదు. ప్లేట్ లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఎక్కిస్తారు. ప్లేట్ లెట్స్ 50 వేల కన్నా పడిపోతే ఆసుపత్రిలో చేర్చాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్‌లెట్స్ 20 వేల కన్నా తగ్గి, రక్తస్రావం లక్షణాలు కనిపిస్తే బయట నుంచి ప్లేట్‌లెట్స్ ఎక్కించాల్సి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అదే 10 వేలకు పడిపోతే రక్తస్రావం ఉన్నా, లేకున్నా ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని సూచిస్తున్నారు.

పరీక్షలు, చికిత్స

డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికిగానీ, దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి గానీ తీసుకెళ్లాలి. తగిన వైద్య పరీక్షలు చేసుకొని చికిత్స పొందాలి. డెంగ్యూ వ్యాధి నిర్ధారణకు ఎలీసా పరీక్ష ఉత్తమమైన ప్రామాణికంగా తీసుకుంటారు. బ్రూఫెన్ వంటి నొప్పి నివారణ మందులు వాడరాదు. ద్రవ పదార్థాలు, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు ఎక్కువగా తాగాలి.

అర్ధరాత్రి ఇంట్లోకి దూరి బంగారు గొలుసు చోరీ

మానకొండూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితురాలి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామంచ పోచమ్మ(85) అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. రాత్రి ఆమె నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగుడు తులుపులు పగులకొట్టి ఇంట్లోకి చొరబడ్డాడు. ఆమెపై దాడిచేసి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. వృద్ధురాలు కేకలు వేయడంతో ఆమె నోటిని గట్టిగా ఒత్తడంతో రెండు పళ్లు ఊడిపోయాయి. గురువారం ఆమె పెద్ద కుమారుడు రామంచ మల్లయ్య ఫిర్యాదు చేయడంతో సీఐ సంజీవ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోపాల్‌రావుపేటలో రెండిళ్లలో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ



దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రామడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో దొంగలు తాళంవేసిన ఇళ్లల్లోప్రవేశించి నగదు, బంగారు, వెండిఆభరణాలను అపహరించుకువెళ్లారు. బాధితులకథనం ప్రకారం.. గోపాల్‌రావుపేటకు చెందిన నల్ల శ్రీనివాస్, ఎగుర్ల బీరయ్య ఇళ్ల పక్కపక్కనే ఉన్నాయి. అయితే ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం వేములవాడకు వెళ్లారు. ఒకరి ఇల్లు తర్వాత మరో ఇంటిలో ప్రవేశించిన దొంగలు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నగదు, బంగారం చోరీ చేశారు. ఈసందర్భంగా బీరయ్య ఇంట్లో లక్ష రూపాయల నగదు, 70తులాల వెండి, అలాగే శ్రీనివాస్ ఇంట్లో రూ.60వేలనగదు, నాలుగున్నర తులాల బంగారుఆభరణాలు అపహరించినట్లు తెలిపారు. గురువారం ఉదయం వారు ఇంటికి రాగా దొంగతనం జరిగినట్లుగ్రహించి పోలీసులు సమాచారం అందించారు. దీంతో ట్రైనీఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో ఫింగర్‌ప్రింట్ నిపుణులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కాల్వశ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎదిలాపూర్ గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. వారివద్ద నుంచి 1,28,780 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. రామకృష్ణాపూర్‌కు చెందిన మారేపల్లి సతీష్‌కుమార్, మంచిర్యాలకు చెందిన పుప్పాల రవి, ఖిలా వరంగల్ శంభునిపేటకు చెందిన ఎండీ. జావీద్, రాపాని శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా తాండూరుకు చెందిన గంగాధర్, పెద్దపల్లికి చెందిన పిడుగు రమేష్‌లు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- ఆరుగురు అరెస్టు...
- రూ. 8800 స్వాధీనం

శంకరపట్నం, మే 15 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం గద్దపాకలో పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8800 నగదు స్వాధీనం చేసుకొని వారిని కేశవపట్నం పోలీసులకు అప్పగించారు. వారిపై కేశవపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో రాచర్లగొల్లపల్లికి చెందిన అభినవ్, భరత్‌లు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అభినవ్, భరత్‌లు కలిసి రాచర్లగొల్లపల్లి వైపుకు వెళుతున్న క్రమంలో బైక్, కారులు ఢీకొన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురికి గాయాలు..

తంగళ్లపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామ శివారులో పాదచారులను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సిద్దిపేట జిల్లా చెందిన సుమారు 20మంది హనుమాన్ భక్తులు కాలినడకన కొండగట్టుకు వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో సిద్దిపేట జిల్లాకు చెందిన కన్నబోయిన ప్రశాంత్, పందిళ్ళ సురేష్‌తో పాటు తంగళ్ళపల్లి మండలం బాలమల్లు పల్లె గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు కస్తూరి నారాయణ రెడ్డి గాయపడ్డారు. గాయపడ్డ వారిని 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సన్నవడ్లు కొనాలని రోడ్డెక్కిన రైతులు

- రైతులను దూషించిన ఆలయ చైర్మన్
- ఆగ్రహంతో చితకబాదిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

పెద్దపల్లి రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యం పండిస్తే బోనస్ ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో రైతులు కొంతమేర సన్న రకాలను పండించారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురాగా నెల రోజులు గడిచినా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంపై రైతులు రోడ్డెక్కారు. అటుగా వెళ్తున్న ఓ ప్రజా ప్రతినిధి సంఘటన స్థలానికి చేరుకోని రైతులను దూషించడంతో రైతులు అతడిపై దాడి చేశారు. పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి గ్రామానికి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో సన్నరకం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి-జూలపల్లి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని, అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతున్నామని నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో నిమ్మనపల్లి గ్రామం నుంచి పెద్దపల్లికి కారులో వెళ్తున్న సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి నంబులాద్రి ఆలయ చైర్మన్ అట్ల కుమార్ రైతులు ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకొని రైతులకు ప్రభుత్వం ఏమి తక్కువ చేసిందని ఆందోళన చేస్తున్నారని దూషించాడు. దీంతో ఆవేదన చెందిన రైతులు నిరసనను వదిలిపెట్టి అట్ల కుమార్‌పై దాడి చేశారు. దీంతో రైతులకు, ప్రజాప్రతినిధికి మధ్య తోపులాట జరిగింది. తోపులాటలో నిమ్మనపల్లి గ్రామానికి చెందిన రైతు ఆకుల సంపత్ చొక్కా చినిగిపోయి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రైతులను శాంతింపచేయడంతో గొడవ సద్దుమణిగింది. కొనుగోలు కేంద్రం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నాయకత్వం రాజకీయ పార్టీల అంతర్గత వ్యవహారం

- హరీశ్‌రావుపై సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నాయకత్వం అనేది రాజకీయ పార్టీల అంతర్గత వ్యవహారమని, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమను సంప్రదించి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్‌ను నియమించారా? అని ప్రశ్నించారు. మహేష్ కుమార్‌గౌడ్‌ను ఎందుకు నియమించారని, దళితుడికి ఎందుకు ఇవ్వలేదని తాము అడిగామా? అన్నారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పనిచేసే పార్టీ అని, ఎవరైతే తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందో వారినే బీఆర్ఎస్ ఎంచుకుంటుందని అన్నారు. దళిత ముఖ్యమంత్రి అన్నది 2014కు ముందు అని, తాము అధికారంలోకి రాలేదని, విజయ రామారావును బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్‌గా నియమించామని గుర్తుచేశారు. వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ సీఎం అయితేనే మంచిది అనుకున్నామని, పార్టీతోపాటు తెలంగాణ ముక్తకంఠంతో నిర్ణయం తీసుకుందని, అందుకే దళితుడు సీఎం కాలేదని అన్నారు. కొత్తగా వచ్చిన రాష్ట్రంలో కేసీఆర్ తప్ప ఎవరు సీఎం అయినా రాష్ట్రానికి నష్టం జరిగేదని, రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రాష్ట్రం పరిస్థితి ఏమిటో చూస్తున్నామని అన్నారు. ఖర్గే ఏఐసీసీ డమ్మీ అధ్యక్షుడని, నడిపేదంతా రాహుల్ అనిజనానికి తెలియదా? అన్నారు. సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తప్ప కాంగ్రెస్‌లో ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పగ్గాలు దళితుడికి ఇవ్వాలంటున్న రేవంత్‌రెడ్డి ఖర్గేను పీఎం చేస్తామని ఎందుకు చెప్పడం లేదని, రాహుల్‌ని పీఎం చేస్తామని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. 50 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఇప్పటి వరకు కులగణన ఎందుకు నిర్వహించలేదన్నారు. దళితులపై కాంగ్రెస్‌ది, రేవంత్‌ది మొసలి కన్నీరని, పెదవుల మీద ప్రేమ తప్ప దళితులకు పదవులిచ్చే ప్రేమ కాదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే దామోదర రాజనరసింహను లేదా వివేక్ వెంకటస్వామిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఏ నిర్ణయం తీసుకో వాలన్నా ఢిల్లీకి వెళ్లి లాబియింగ్ చేయాల్సిందేనని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడున్న పరిస్థితుల్లో మంత్రివర్గ విస్తరణచేస్తే పదవికి ఎసరు వస్తుందని భయపడుతున్నార న్నారు. బిల్లా రంగా అని తమ నేతలను సంబోధించడం ద్వారా రేవంత్ సీఎం స్థాయిని తగ్గించారని, బిల్లా రంగాల చేష్టలు రేవంత్‌వేనని అన్నారు. రేవంత్ బిల్లా రంగాల స్థాయి ఎప్పుడో దాటిపోయారని, చార్లెస్ శోభరాజ్‌ను మించిపోయారని విమర్శించారు. అంబేద్కర్‌ను ఓడించి, జగ్జీవన్‌రామ్‌ను అవమానించిన కాంగ్రెస్‌కు నీతులు చెప్పే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. దళితులకు రెండుసార్లు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. రేవంత్‌కు దళితులపై ప్రేమ ఉంటే ఓ దళితుడిని సీఎం చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారంలో రేవంత్ జోక్యం తగ్గించి పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కాంగ్రెస్ చేవెళ్ల దళిత డిక్లరేషన్ అమలుపై ఆలోచించాలన్నారు. తామంతా తమ నాయకుడు కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రఘువీర్‌సింగ్, గుంజపడుగు హరిప్రసాద్, మైకెల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలు



శేఖర్(ఫైల్)

మల్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టు సమీపంలోని జగిత్యాల మార్గంలో మారుతీ టౌన్‌షిప్ ఎదురుగా గల రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కొడిమ్యాల మండలం రాంసాగర్‌కు చెందిన అనుముల శేఖర్(32) అనే యువకుడి మృతదేహం రైల్వే ట్రాక్ పక్కన పడి ఉండడంతో కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటన స్థలం పరిశీలిం చారు.

- బెట్టింగ్‌లో అప్పుల పాలై..

ఆత్మహత్యకు పాల్పడిన శేఖర్ కొన్నాళ్ల క్రితం విదేశాలకు వెళ్లి రాగా గత మూడేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొనడంతో అప్పుల పాలైనట్లు తెలుస్తోంది. సుమారు రూ.15లక్షలపైన అప్పులు కావడంతో మూడు రోజుల క్రితం సింగపూర్ వెళ్లడానికి హైదరా బాద్‌లో శిక్షణకు వెలుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. గురువారం శేఖర్ మృతదేహం రైల్వే ట్రాక్ వద్ద లభించడంతో భార్య, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



మృతిచెందిన ఆవు

సైదాపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన రైతు భూతాల బాపురావుకు చెందిన పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. రైతు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాడి ఆవు గడ్డి మేస్తూ ట్రాన్స్ ఫార్మర్ వద్దకు పోయింది. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో విద్యుత్ వైర్లు ఆవుకు తగిలడంతో అది అక్కడిక్కడే మృతి చెందింది.

సరస్వతి నమస్తుభ్యం..



పుష్కర స్నానం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే విజయరమణారావు



పుణ్యస్నానాలాచరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యులు

- కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ప్రారంభం
- పుష్కర స్నానం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు
- తొలిరోజే పోటెత్తిన భక్తులు

కాళేశ్వరం, మే 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతి నది పుష్కరాలు గురువారం వేకువజామున ప్రారంభమయ్యాయి. కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద ఉదయం 5.40 గంటలకు పీఠాధిపతి గురు మాధవానంద సరస్వతి పుష్కరాలను ప్రారంభించారు. తొలిరోజే పుష్కర స్నానాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు పుష్కర స్నానం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసగించారు. ఈ నెల 26 వరకు సరస్వతీ పుష్కరాలు జరుగనున్నాయి.

ఎండను సైతం లెక్కచేయకుండా

సరస్వతి నది పుష్కరాలకు భక్తులు ఎండ సైతం లెక్కచేయకుండా తరలివచ్చారు. మధ్యాహ్నం సమయంలో కూడ పుష్కర స్నానాలు ఆచరించడానికి భక్తులు నదికి రావడంతో జన సంద్రంగా మారింది. ఉదయం భక్తుల రద్దీ ఉండగా మధ్యాహ్నం వరకూ కొనసాగింది. ఎండకు వచ్చిన భక్తులు నదిలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో సేద తీరారు.

భక్తుల సౌకర్యార్థం బస్సుల ఏర్పాటు

సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక బస్టాండ్ వద్ద ప్రైవేటు పాఠశాలల, సింగరేణి బస్సులను ఏర్పాటు చేశారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద నుంచి పుష్కర ఘాట్‌కు ప్రయాణికులను తరలించేందుకు సుమారు 30 బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ బస్సులు ప్రయాణికులను పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ వద్ద దించి తిరిగి తాత్కాలిక బస్టాండ్ వద్దకు చేరుకుంటున్నాయి.

పుష్కర ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు

పుష్కర ఘాట్ వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. మహాదేవపూర్, కాళేశ్వరానికి చెందిన 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, స్థానిక ఈతగాళ్లు రెండు షిఫ్ట్‌ల్లో అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. నదిలో భక్తులు లోతుకు వెళ్లకుండా మరో బృందం గస్తీ తిరుగుతూ భక్తులను అప్రమత్తం చేస్తుంది.

ఫొటోల కోసం క్యూ..

పుష్కరాల్లో భాగంగా సరస్వతి మాత విగ్రహం సమీపంలో, టెంట్ సిటీ, ఇతరాత్ర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దేవుడి విగ్రహాల వద్ద ఫొటోలు దిగేందుకు భక్తులు క్యూ కట్టారు.

నేడు ఉపముఖ్యమంత్రి రాక

సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన నేపథ్యంలో శుక్రవారం కాళేశ్వరానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రానున్నారు. ఉదయం కాళేశ్వరం చేరుకుని సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారు.

అందుబాటులో ఫైర్ వాహనాలు

సరస్వతి పుష్కరాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అగ్నిమాపక శకటాలను అందుబాటులో ఉంచారు. నాలుగు ఫైర్ వాహనాలు, 2 ఓపీఎమ్ బోట్లు, 40 మంది సిబ్బంది, 2 రిమోట్ కంట్రోల్ బోట్లు 24 గంటలు అందుబాటులో ఉండనున్నాయి. హెలీప్యాడ్, సరస్వతీ పుష్కర ఘాట్, టెంట్‌సిటీ, టెంపుల్ వద్ద ఈ ఫైర్ ఇంజన్ వాహనాలు, అగ్నిమాపకశాఖ యంత్రాంగం అందుబాటులో ఉంటుంది.

సీఎం రాకతో దర్శనాల నిలిపివేత

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో భక్తుల దర్శనాలను అధికారులు నిలిపివేశారు. ముఖ్యమంత్రి తొలుత పుష్కర ఘాట్‌ను ప్రారంభించి న అనంతరం ఆలయానికి చేరుకుని మహాదేవుడికి జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నా లుగు గంటల పా టు దర్శనాలను నిలిపివేశారు. దాంతో వివిధ ప్రాం తాల నుంచి వచ్చిన భక్తులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.



సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు, నాయకులు

పుష్కరఘాట్ వద్దకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, నాయకులు









త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు

అనాథ యువతి వివాహానికి కలెక్టరే పెళ్లి పెద్ద

- జిల్లా అధికారుల పేర్లతో వివాహా ఆహ్వాన పత్రిక

పెద్దపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): అనాథ యువతి వివాహానికి కలెక్టరే పెళ్లి పెద్దగా మారాడు... వివాహా ఆహ్వాన ప్రతికలో ఆహ్వానించు వారిలో అధికారికంగా కలెక్టర్‌తోపాటు జిల్లా పాలన యంత్రాంగం మొత్తం ఆహ్వానించిన సంఘటన పెద్దపల్లి జిల్లా రామగుండంలో జరిగింది. రామగుండానికి చెందిన తబితా అనాథ ఆశ్రమంలో తల్లిదండ్రులను కోల్పోయిన మానస 16ఏళ్లుగా చెల్లెలుతో కలిసి ఆశ్రయం పొందుతున్నది. ఆమెకు జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన రాజేశ్‌తో వివాహం నిశ్చియమైంది. యువతి వివాహానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌లు పెళ్లిపెద్దగా ఉండేందుకు అంగీకరించారు. ఆడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) జే అరుణశ్రీ, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డీ వేణుగోపాల్ ఆశీస్సుల పేర పెళ్లి ఆహ్వాన ప్రతికలను పంపిణీ చేశారు.

ఈనెల 21న ఉదయం 11.05గంటలకు పెద్దపల్లి జిల్లా కేంద్రం కలెక్టరేట్ సమీపంలోని వేంకటేశ్వర కళ్యాణ మండపంలో వీరి వివాహం జరుగనున్నది. అనాథ యువతి వివాహానికి కలెక్టర్, జిల్లా పాలన యంతాంగమే పెళ్లి పెద్దలుగా అండగా మారడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



పెళ్లి పెద్దగా కలెక్టర్ పేరుతో పెళ్లి ఆహ్వాన పత్రిక

ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల కబడ్డీ టోర్నమెంట్

భీమదేవరపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌జిల్లాల కబడ్డీ క్రీడోత్సవాలను ఈనెల23,24,25వ తేదీల్లో భీమదేవరపల్లి మండలంలోని గాంధీనగర్ గ్రామంలో తెలంగాణ పొదుపుసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. యువత డ్రగ్స్‌కు, ఆన్‌లైన్ గేమ్, మద్యానికిబానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆత్మస్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. దీంతో యువతను క్రీడల వైపు మళ్లించి నూతన ఉత్తేజాన్నినింపాలనే ఉద్దేశ్యంతో గాంధీనగర్ అంబేద్కర్ పొదుపుసంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌జిల్లాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్రీడాపోటీలకు సంబంధించి గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల23,24,25వ తేదీల్లో జరిగే ఈక్రీడాపోటీల్లో గెలుపొందిన మొదటిజట్టుకు రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతి రూ.10వేలు, నాల్గో బహుమతి రూ.5వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు, అతిథులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

మల్టీజోన్ - 1 పరిధిలో తహసీల్దార్ల బదిలీలు

- జగిత్యాల నుంచి ఇతర జిల్లాలకు నలుగురు
- ఇతర జిల్లాల నుంచి జగిత్యాలకు ముగ్గురు కేటాయింపు

జగిత్యాల, మే 15 (ఆంధ్రజ్యోతి): మల్టీజోన్-1 పరిధిలోని పలువురు తహసీల్దార్లను బదిలీచేస్తూ గురువారం ల్యాండ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీచేశారు. జగిత్యాల నుంచి నలుగురు తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీచేయగా, ఇతర జిల్లాల నుంచి జగిత్యాలజిల్లాకు ముగ్గురు తహసీల్దార్లను కేటాయించారు. ఇందులో జగిత్యాల కలెక్టరేట్‌లోని సీసెక్షన్ ఇన్‌చార్జిగా పని చేస్తున్న తహసీల్దార్ విశ్వంబర్ నిర్మల్ జిల్లాకు, బీర్‌పూర్ తహసీల్దార్ ఎంకే ముజాబొద్దీన్ నిజామాబాద్ జిల్లాకు, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ప్రసాద్ నిజామాబాద్ జిల్లాకు, మల్లాపూర్ తహసీల్దార్ వీర్‌సింగ్ నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అదే విధంగా కరీంనగర్‌జిల్లా నుంచి తహసీల్దార్ రాజేశ్, నిజామాబాద్‌జిల్లా నుంచి తహసీల్దార్ నాగార్జున, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లానుంచి తహసీల్దార్ ఉదయ్ కుమార్‌ను జగిత్యాల జిల్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



సంట్రెడ్డి బావి వద్ద జన సందడి

సంట్రెడ్డి బావే పెద్దపల్లి స్విమ్మింగ్ పూల్

- వేసవి సెలవుల్లో రోజంతా రద్దీ

పెద్దపల్లిటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంట్రెడ్డి బావి స్విమ్మింగ్ పూల్‌గా మారింది. వేసవి సెలవులు కావడంతో పిల్లలు, పెద్దలు, విద్యార్థులతో కిటకిటలాడుతోంది. స్విమ్మింగ్‌కు మిచ్చిన వ్యాయామం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. బంధంపల్లి గ్రామ శివారులో పెద్దపల్లికి మూడు నుంచి నాలుగు కిలో మీటర్ల దూరంలో సంట్రెడ్డి బావి ఉంది. కాలాలతో సంబంధం లేకుండా నిత్యం ఉదయం వేళ ఈత కొడుతుంటారు. ఉదయం ఐదు గంటలకే ఈత కొట్టేందుకు బావి వద్దకు వస్తారు. వేసవి సెలవుల్లో పిల్లలకు బావి వద్ద ఈత నేర్పిస్తున్నారు. ట్యూబ్‌లు, వాటర్ క్యాన్లతో పిల్లలకు అలవాటు చేస్తున్నారు. పలువురు వృద్ధులు సైతం ఈత కొట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ బావి వ్యవసాయానికి నీరందించడం వల్ల ఎప్పటికప్పుడు నీరు శుభ్రంగా ఉంటుంది. పంటలు లేని సమయంలో రెండు మూడు రోజుకొకసారి నీరు ఖాళీ చేయించి నీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుద్ధి చేస్తారు.రెగ్యులర్ ఈతకు వచ్చే వారు వాట్సప్ గ్రూప్ తయారు చేసికొని సమాచారం ఇచ్చుకుంటున్నారు.

ఈత వల్ల లాభాలు

క్రమం తప్పకుండా ఈత కొట్టడం వల్ల బరువు తగ్గించుకోవచ్చు. శారీరక శక్తి పెరగడం, అన్ని కండరాలకు వ్యాయమం జరిగి మోకాళ్ల నొప్పులు రాకుండా ఉండడం, గుండెకు సమస్యలను రాకుండా ఉపయోగపడుతుంది. నిత్యం 30 నిమిషాల నుంచి గంట ఈత కొడితే ఆరోగ్యంగా ఉండవచ్చు.

బరువు తగ్గిన..

: ఠాగూర్ రాంసింగ్



నేను ఎనిమిదేళ్ళుగా ఇదే బావిలో ఈత కొడుతున్నాను. 120 కేజీల బరువు ఉన్నవాన్ని ఇప్పుడు 90 పైచిలుకు బరువు తగ్గాను. ఏ కాలంలోనైన ఈత కొడుతుంటా.

రోజుకు గంట స్విమింగ్ చేస్తా: రాజు



రోజుకు గంట స్విమ్మింగ్ చేస్తా. ఈతతో మంచి ఆరోగ్యంగా ఉన్నాను. రోజంతా హుషారుగా ఉంటుంది. ఈతకు రాని రోజు బద్దకంగా అనిపిస్తుంది.

కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలి

- ప్రజా సంఘాలు, సింగరేణి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఖనిలో శాంతి ర్యాలీ

కళ్యాణ్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని, ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలో అమలు చేస్తున్న కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలని కోరుతూ ప్రజాసంఘాలు, సింగరేణి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖనిలో ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గోదావరిఖని చౌరస్తా నుంచి రీగల్ షూ మార్ట్ సెంటర్, లక్ష్మీనగర్ కూడళ్ల మీదుగా చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం 2021 జనవరి 1 నుంచి ప్రారంభించిన ఆపరేషన్ కగార్‌తో ఇప్పటి వరకు 510మంది ఆదివాసీలు, మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లు, దాడులలో హత్యకు గురయ్యారన్నారు. కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలనే డిమాండ్ మేరకు శాంతి చర్చలకు సిద్ధమని, ఆరు నెలల వరకు కాల్పుల విరమణ పాటిస్తున్నామని మావోయిస్టులు ప్రకటించారన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకుడు కేసీఆర్ కూడా శాంతి చర్చల జరగాలని కేంద్రానికి లేఖలు రాస్తామన్నారు. వామపక్షాలు కొన్ని నెలలుగా శాంతి చర్చలు జరగాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించలేదని, దేశవ్యాప్తంగా శాంతి చర్చలకు వస్తున్న ప్రజల ప్రజాస్వామిక డిమాండ్ మేరకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలన్నారు. ఆదివాసీల పోరాట సంఘ ఐక్యవేదిక నాయకులు ముడిమడుగుల మల్లయ్య, తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఉప్పులేటి పర్వతాలు, గూడూరు లవన్‌కుమార్, రత్నకుమార్, వేల్పుల కుమారస్వామి, ఎస్ సమ్మక్క, ఎస్‌కే షైముదా, లలిత, మహమ్మదీన్, రహీం, దుర్గం నగేష్, సురేష్, యాదయ్య, పాల్గొన్నారు.



ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల నాయకులు

బర్త్‌డే పార్టీలో వివాదం

- ముగ్గురు యువకులకు కత్తి పోట్లు
- ఒకరి పరిస్థితి విషమం

జగిత్యాల అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని లింగంపేట చెరువు వద్ద గురువారం ఓ బర్త్‌డే పార్టీలో జరిగిన వివాదం కత్తి పోట్లకు దారి తీసింది. అంతర్గాం గ్రామానికి చెందిన అరవింద్, వంశీ, గంగాధర్‌పై అదేగ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కత్తులతో విచక్షణారహితంగా దాడిచేశారు. గాయాలపాలైన యువకు లను జగిత్యాల ప్రధానాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కత్తిపోట్లకు గురైన యువకులలో గంగాధర్ అనే యువకునికి 25 కన్నా ఎక్కువ చోట్ల కత్తి పోట్లు పడడడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



యువకులకు చికిత్స చేస్తున్న వైద్యులు

హమాలీల షెడ్డు దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేటలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హమాలీ షెడ్డుకు నిప్పంటించారు. షెడ్డు పూర్తిగా కాలిపోయింది. ఈ విషయంపై హమాలీ కార్మికుల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. గురువారం మండలు అంటుకొని దగ్ధమైన షెడ్డును మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పరిశీలించి నిర్మాణానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌చైర్మన్ రాముడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీఎంపీటీసీలు పోశాల సదానందంగౌడ్, మొగిలి సదానందం, హమాలీ కార్మికులు ఉన్నారు.




దగ్ధమైన షెడ్డును పరిశీలిస్తున్న సారయ్యగౌడ్

ఘనంగా 'సందల్' ప్రదర్శన

- వేడుకలకు హాజరైన కేటీఆర్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాహుస్సేన్
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



గుర్రాల విన్యాసాలు



విద్యుద్దీపాల కాంతుల్లో గుట్ట ప్రాంతం



మాట్లాడుతున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, మే 15(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామశివారులోని దర్వేశ్అలీషా ఖాద్రీ గుట్ట దర్గా వద్ద ఉర్సు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని నిర్వహణకర్త అజీజ్ ఇంటి నుంచి 'సందల్' ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ దర్గా వరకు తీసుకెళ్లారు. గుర్రపు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దర్గా వరకు ప్రదర్శనగా వెళ్లారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత గురువులు ప్రబోధనలు చేశారు. అనంతరం ముంబాయి, ఉత్తరప్రదేశ్, హైదరాబాద్‌కు చెందిన అజీమ్ నజా, రేహన్ అలీ, అక్బర్ హుస్సేన్‌ల ఖవాలీ కార్యక్రమాలు అలరించాయి. సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లాహుస్సేన్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరిలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నేతలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో సర్వమతాల సంక్షేమానికి కృషి చేశామన్నారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ మతం పేరిట రాజకీయం లేదని అన్నారు. అన్ని మతాల పేదలను సమదృష్టితో చూసి వారి అభ్యున్నతికి పాటు పడ్డారని అన్నారు. ప్రస్తుతం ఏ విధంగా ఉందో తాను చెప్పలేనని, ఇక్కడ తాను రాజకీయాలు మాట్లాడేందుకు రాలేదని, దర్వేశ్ అలీబాబా ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, రాష్ట్ర ప్రజలు సంతోషం, సుభిక్షంగా ఉండాలన్నారు. మతం, కులం పేరిట పంచాయతీలు లేకుండా అందరం భారత దేశం బాగు కోసం కలిసి కొట్లాడాలని ఆ బాబాను కోరుకుంటున్నానని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ మాట్లాడుతూ అన్ని మతాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని అన్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లి దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలు జిల్లాలతో పాటు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు.

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

- పట్టించుకోని పురపాలక సంఘం అధికారులు



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

సిరిసిల్ల టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల పురపాలక సంఘం కార్యాలయం వెనకాల మురుగునీరు రోడ్డుపై పారుతోంది. నిత్యం రద్దీగా ఉండే లేబర్అడ్డాలో మురుగునీరు ప్రవహించడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పురపాలక సంఘం అధికారులు స్పందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై కూలిన చెట్టు.. నిలిచిన రాకపోకలు..



రోడ్డుకు అడ్డుగా పడిపోయిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న భారీ వృక్షానికి మంటలు వ్యాపించి నిప్పంటుకుంది. చెట్టు మొదట్లో పూర్తి కాలిపోయి గురువారం ప్రధాన రోడ్డుపై కూలిపోయింది. ఆ సమయంలో రహదారిపై ఎవరు లేకపోవడం వల్ల భారీ ప్రమాదం తప్పినట్లయింది. సుమారు 2 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసులు చేరుకుని చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

నాణ్యతతో కూడిన వైద్యం అందించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత



చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన వైద్యాధికారుల బృందం

చందుర్తి, మే 15 (ఆంధ్రజ్యోతి) : వ్యాధిగ్రస్తులకు నాణ్యతతో కూడిన వైద్య సహాయం అందించాలని జిల్లా వైద్యాధికారిని రజిత అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను కాయకల్ప అసెస్మెంట్ జిల్లా టీంతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలతో పాటు ఆసుపత్రి లోపల పరిశుభ్రతతో పాటు, వ్యాధిగ్రస్తులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి తాగునీరు, బాత్రూం, విద్యుత్ సౌకర్యం, బిల్డింగ్ నాణ్యత ప్రమాణలపై జిల్లా క్వాలిటీ సిబ్బందితో తనిఖీ నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ టీం ఎన్‌హెచ్ఎం డీపీవో రాజేందర్, క్వాలిటీ మేనేజర్ సింధుజ, వైద్యాధికారులు డాక్టర్ సురేష్, డాక్టర్ దివ్యశ్రీ లు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వీర్నపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని మండల వైద్యాధికారిని డాక్టర్ సరియా అంజుమ్ అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 67 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 26 మందికి రక్త పరీక్షలు చేసినట్లు ఆమె తెలిపారు. దంత, చర్మ సమస్యలు ఉన్న వారిని సీహెచ్‌సీ ఎల్లారెడ్డిపేటకు పంపించామన్నారు. ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఇందిర, ఎమ్ఎల్‌హెచ్‌పి చైతన్య, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎం రూతమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లింగన్నపేటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త కనకదుర్గ

గంభీరావుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, అన్నదాతలకు అవగాహన కార్యక్రమాన్ని గంభీరావుపేట మండలం లింగన్నపేట రైతు వేదికలో గురువారం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కనక దుర్గ, సతీష్, కొత్తపల్లి సింగిల్‌విండో చైర్మెన్ సురెందర్, మండల వ్యవసాయ అధికారి సల్లావొద్దీన్, మండల ఉద్యానవన అధికారి లోకేష్ రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడుల కోసం చేపట్టాల్సిన అదునాతన వ్యవసాయ సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించారు. రైతులకు క్షేత్రస్థాయిలో అవసరమయ్యే తక్కువ యూరియా వాడటం, సాగు ఖర్చు తగ్గించటం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటం, రశీదులను భద్రపర్చడం, కష్టకాలంలో నష్ట పరిహారాన్ని పొందటం, సాగు నీటిని ఆదా చేసి భావితరాలకు అందించటం, పంట మార్పిడి పాటించటం, సుస్థిర ఆదాయాన్ని పొందటం, మొక్కలను పెంచటం, పర్యావరణాన్ని కాపాటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వీటితో పాటు వివిధ రకాల నూతన వంగడాలు, కూరగాయల సాగు, పంటల్లో చీడ పీడ నివారణ చర్యలను వివరించారు. రైతులు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత అందరి బాధ్యత

- డీఆర్డీవో శేషాద్రి - ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. యూనిసెఫ్, స్వచభారత్ సమన్వయంతో పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం అనే అంశంపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని ఆయా మండలాల ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, డీఆర్డీఓ శేషాద్రి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో చెత్త నిర్వహణ, సేంద్రీయ ఎరువు తయారీ, తదితర అంశాలపై పనిచేస్తున్న పారిశుధ్య కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉద్ఘాటించారు. పారిశుధ్య కార్మికులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన, ఇష్టమైన రీతిలో పని చేసేందుకు సరైన వాతావరణం ఏర్పాటు చేయాలని యూనిసెఫ్ శిక్షకుడు ఫణీంద్ర తెలిపారు. పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, రక్షణ కవచాలు ఇచ్చి వాడేలా అవగాహన కలించాలని సూచించారు. దీంతో కార్మికుల, వారి కుటుంబ సభ్యుల భద్రతకు చేయూత ఇస్తుందని యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్ స్వామి తెలిపారు. ప్రతి ఇంటి స్థాయిలో తడి, పొడి చెత్త వేరు, కంపోస్ట్ షెడ్ల వినియోగం, ఎరువు తయారీ, చెత్త నుంచి సంపద తయారీ తదితర అంశాలపై స్వచ్ఛభారత్ శిక్షకుడు రమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో సామూహిక ఇంకుడు గుంతలు, పైప్ కంపోస్ట్ పద్ధతులు, విజయగాధలపై సిరిసిల్ల స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ సురేష్ వివరించారు. అనంతరం ఉత్తమ సేవలు అందిస్తున్న జిల్లాలోని పలువురు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో నరేష్, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు, ఎస్బీఎం కన్సల్టెంట్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు..

- ఆన్‌లైన్‌లో కూలీల ఫొటోకు బదులు మొక్కల ఫొటోలు - కలెక్టర్‌కు సోషల్ మీడియాలో ఫిర్యాదు - అధికారుల విచారణ



ఉపాధి పనుల వివరాలు తెలపడం లేదంటున్న కూలీలు

వీర్నపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెలో కూలీలకు పని కల్పించాల్సిన పథకంలో ఆన్‌లైన్ హాజరు నమోదులో కూలీల ఫొటోలకు బదులు మొక్కల ఫొటోలను నమోదుచేస్తున్నారు. అలా నమోదైన ఉపాధి డబ్బులను పనిచేయని వారి పేరిట ఖాతాల్లో వేస్తున్నారని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు సోషల్ మీడియాలో ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. ఇదే విషయంపై ఈజీఎస్ ఏపీడీ నర్సింహులు వీర్నపల్లి మండలం బంజేరు, సీతా రాంనాయక్ తండా గ్రామాల్లో గురువారం వివరాలు సేకరించారు. ఫిర్యాదు అందిన కూలీలను విచారణ చేయగా సమాధానాలు చెప్పడంలో తడబడ్డారు. కొంతమంది కూలీలు తమను సమావేశానికి పిలవకుండానే కావలసిన వారిని తీసుకెళ్తున్నారంటే ఆరోపించారు. మండల స్థాయి అధికారుల తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి నామమాత్రంగానే విచారణ చేశారని పలువురు ఆరోపించారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆన్‌లైన్ నమోదులో పనిచేసిన వారి గ్రూప్ ఫొటోలు నమోదు చేయాల్సిన వాటిలో మొక్కల ఫొటోలను నమోదు చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోలేదు. మండలానికి టెక్నికల్ అసిస్టెంట్‌లు లేకపోవడంతో సొంత మండలానికి చెందిన వారే ఇన్‌చార్జ్ టెక్నికల్ అసిస్టెంట్‌లుగా పనిచేయడంపై ఉపాధి కూలీలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీడీ నర్సింహులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేసి రికార్డులను పరిశీలిస్తామన్నారు. పని ప్రదేశంలో వంద మందికి ఒక మేటు ఉండాలని సూచించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సమావేశంలో ఏపీవో శ్రీహరి, ఇన్‌చార్జ్ టెక్నికల్ అసిస్టెంట్‌లు అనిత, గంగాధర్, ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో మండలంలోని కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని మొత్తం 79 మంది లబ్ధిదారులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డీవో వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, తహసీల్దార్ జయంత్ కుమార్ చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగ్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు గడ్డం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు గురువారం అందజేశారు. గ్రామంలోని మారుపాక మమతకు రూ 21 వేలు. చల్ల భవానికి రూ 18 వేలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధ పడుతున్న నిరుపేదలకు చికిత్స పొందేందుకు సీఎం సహాయ నిధి వరం అని అన్నారు. కార్యమంలో నాయకులు స్వామి, శ్రీనివాస్, రాజు, తిరుపతి, కైలాసం, సంతోష్, మల్లారెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతుల గుర్తింపు కార్డుతో బహుళ ప్రయోజనాలు

ఇల్లంతకుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): రైతుల గుర్తింపు కార్డులతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దాచారం గ్రామంలోని రైతువేదికలో గురువారం జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు కేంద్రప్రభుత్వ పథకాలు రైతులకు వర్తించాలంటే గుర్తింపుకార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అర్చన, రైతులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రాన్ని అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం సూపరింటెండెంట్‌ను కలిసి అనుమతులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలంటూ వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అనుమతులు, గుర్తింపులు లేని పాఠశాలల కొనసాగుతున్నాయని వీటిపై ఫిర్యాదులు చేసినప్పటికి ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో ప్రైవేటుతో పాటు కార్పొరేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్నాయని అన్నారు. అలాంటి పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్, జగన్, అనిల్, షేక్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు



వట్టెంలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వేములవాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వట్టెంల గ్రామంలోని రైతు వేదికలో పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. సరైన మోతాదులో పంటకు యూరియా ఉపయోగించడం, వర్మి కంపోస్ట్, పంటకు పశువుల ఎరువు వాడడం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ రజియా సుల్తానా, ఏడీఏ రామారావు, డాక్టర్ ఏ శ్రీనివాస్, విత్తనోత్పత్తి సంస్థ అధికారి మౌనిక, వ్యవసాయశాఖ అధికారి వినిత, వ్యవసాయ విస్తీరణ అధికారి మసూద్‌పాషా, ప్రేమ్‌సాయి పాల్గొన్నారు.

'మనం బుక్ ఆఫ్ రికార్డు'లో చోటు



కిరణ్ అందుకున్న బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికేట్

సిరిసిల్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన సాహితీవేత్త, ఇంటర్నేషనల్ బెనెవోలెంట్ రీసెర్చ్ ఫోరం సభ్యుడు డాక్టర్ చిటికెన కిరణ్‌కుమార్‌కు మనం బుక్ ఆఫ్ రికార్డులో చోటుదక్కింది. సాహిత్య సామాజిక, రాజకీయ అంశాలపై రచనలు, కథలు, కవితలు రాస్తున్నారు. ఓ తండ్రి తీర్పు లఘు చిత్రానికి ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ అవార్డు లభించింది. కిరణ్‌కుమార్ చేస్తున్న సాహితీ సేవకు మనం బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్‌ను గురువారం ఆన్‌లైన్ ద్వారా అందించారు. కిరణ్‌ను జిల్లా రచయితల సంఘం,మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడికి సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

గంభీరావుపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల బీజేపీ నూతన అధ్యక్షుడు కోడె రమేష్‌ను ముదిరాజ్ సంఘ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. గంభీరావుపేట, నాగంపేట గ్రామాల్లో మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రమేష్‌ను ఘనంగా సన్మానించి, సీట్లు పంచారు. ఈ కర్యాక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శాత్రబోయిన లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం నాయకులు పిట్ల బాబు, రమేష్, ఆనందం, దేవదాసు, దేవేందర్, సంజీవ్, వెంకటయ్య, నర్సయ్య, స్వామి, బాలయ్య, శ్రీనివాస్, నాగంపేట ముదిరాజ్ సంఘ నాయకులు కంకనాల నారాయణ, దేవయ్య, దేవరాజు, మహేష్, మల్లయ్య, మల్లేశం, పర్శరాములు, బీజేపీ నాయకులు నాగరాజు, మల్లేశ్‌యాదవ్, సత్యనారాయణ, స్వామి, దేవేందర్, నవీన్ తదితరులు ఉన్నారు.

హన్మాజిపేట పీహెచ్‌సీ తనిఖీ

వేములవాడ రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత హన్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. నాణ్యతతో కూడిన సదుపాయాలు, ఆసుపత్రి పరిసరాలు, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, బిల్డింగ్ నాణ్యత తదితర అంశాలను జిల్లా కాయకల్ప టీంతో కలిసి పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. జిల్లా క్వాలిటీ టీం ఎన్‌హెచ్ఎండీపీవో రాజేందర్, క్వాలిటీ మేనేజర్ సింధూజ, వైద్యాధికారులు డాక్టర్ సురేష్, డాక్టర్ దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రసమయి జన్మదిన వేడుకలు

ఇల్లంతకుంట, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బస్టాండు ప్రాంతంలో గురువారం కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, మాజీ సర్పంచులు ఉడుతల వెంకన్న, ఒగ్గు నర్సయ్యాయాదవ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.